సాక్షి
వికారాబాద్

గురువారం। 1। ఆగస్టు। 2024



కల్వర్టు ప్రయాణం..

ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 8లో▸



అరకొర వసతులు

అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో గర్భిణులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. 9లో▸



'తెల్ల'బోయిన జొన్న సాగు

దౌల్తాబాద్ మండలంలో తెల్లజొన్న సాగు గణనీయంగా పడిపోయింది. రెండేళ్ల నుంచి ఈ పరిస్థితి నెలకొంది. 9లో▸

న్యూస్‌రీల్

మాజీ సీఎం జగన్‌ను కలిసిన అల్లం



జగన్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తెలంగాణ ఉప సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం విజయవాడలో కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

ఏఎస్‌ఐల బదిలీ



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా 7మంది ఏఎస్‌ఐలు, 6మంది హెడ్ కానిస్టేబుళ్లు, 49 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బదిలీ అయిన వారితో ఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మని, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, బీ సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, ఏఎస్‌ఐ, హెచ్‌సీ, పీసీలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈఈ బదిలీ

తాండూరు: తాండూరు ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్ బదిలీ అయ్యారు. బుధవారం జిల్లా కార్యాలయంలో రిలీవ్ అయ్యారు. 2016లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎనిమిదేళ్ల పాటు తాండూరులో పని చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. పరిగి డీఈఈ సురేందర్‌నాయక్‌కు తాండూరు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు.

అడ్మిషన్లు ప్రారంభం

తాండూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కేంద్రం కోఆర్డినేటర్ నాగేశ్వరాచారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఇంటర్ లేదా ఓపెన్ ఇంటర్ లేదా ఐటీఐ పాసైన వారు అర్హులన్నారు. ఆగస్టు 18వ తేదీ వరకు అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. డిగ్రీలో చేరాలనుకునే వారు స్థానిక పీపుల్స్ డిగ్రీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ కేంద్రానికి రావాలన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆగస్టు 18వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు.

మెరబ్‌కు సీఎం అభినందన

మొయినాబాద్: ఐక్యరాజ్య సమితి యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపికైన మెరల్ మెరబ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్ నుంచి పది మందికి అవకాశం రాగా.. తెలంగాణ నుంచి మెరబ్ సెలక్ట్ అయ్యారు. ఈమె తండ్రి వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన కృపావరం.. కొన్నేళ్లుగా మొయినాబాద్‌లోని చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. మెరబ్ ఘట్‌కేసర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో గతేడాది డిగ్రీ పూర్తి చేసింది. 2023లో నిర్వహించిన పరీక్షకు హాజరై.. ప్రస్తుతం జరిగే ఐరాస యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపికైంది. ఆగస్టు 2 నుంచి 5 వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతోంది.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

కందుకూరు: మీర్‌ఖాన్‌పేటలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నెట్‌జీరో సిటీలో కొనసాగుతున్న సభ ఏర్పాట్లను బుధవారం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి, ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఎస్.పాండు, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.మదన్‌పాల్‌రెడ్డి, కె.వెంకటేశ్, ఢిల్లీ కృష్ణ, జి.దర్శన్, ఈ.శ్రీకాంత్‌రెడ్డి, ఎ.జగదీశ్, జి.యదయ్య, దేవేందర్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తాం

మూడుచోట్ల రైల్వే అండర్ పాస్‌లు అవసరం

- ఔటర్ రింగ్‌రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపుతాం
- స్కూళ్ల వద్ద జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటుకు కృషి
- కుక్కల నియంత్రణకు చర్యలు
- పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం
- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన



ప్రజల సమస్యలను నోట్ చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

వికారాబాద్/అనంతగిరి: పట్టణంలో మూడు చోట్ల ప్రజా రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. రైల్వే ట్రాక్‌ల వద్ద అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్లు లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. ఈ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు పలు సమస్యలను కమిషనర్‌కు విన్నవించి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా పట్టణంలోని స్కూళ్ల వద్ద జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలని.. కుక్కల బెడదను అరికట్టాలని.. కాలనీల్లో రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని.. రోడ్లపై కూరగాయలు విక్రయించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన పట్టణ పరిధిలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ సహకారంతో వికారాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.



ప్రశ్న: రామయ్యగూడ ఎంబీజీ హనుమాన్ మందిరం వద్ద వాటర్ పైప్‌లైన్ కోసం తవ్వారు. పనులు పూర్తయినా గుంతను పూడ్చలేదు. దీంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వెంటనే గుంతను పూడ్చాలి.

– ప్రసాద్, రామయ్యగూడ

కమిషనర్: వెంటనే సిబ్బందిని పంపి గుంతను పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

ప్రశ్న: రైల్వే స్టేషన్ అవతలి వైపు దాదాపు 20 గ్రామాలు, 4 వార్డులు ఉన్నాయి. బ్రిడ్జి లేకపోవడంతో పట్టాలు క్రాస్ చేయాల్సి వస్తోంది. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గతంలో పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొని ఒకరిద్దరు మృత్యువాత పడ్డారు. వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

– అశోక్, సాకేత్ నగర్

కమిషనర్: ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. రైల్వే అధికారులకు సైతం తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

ప్రశ్న: వికారాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఉంటే ట్రాఫిక్ సమస్య ఉండదు. ఏళ్ల తరబడి ఔటర్ రింగ్ రోడ్డు అంటున్నారు.. కానీ కార్యరూపం దాల్చలేదు. వెంటనే అనుమతులు వచ్చేలా చూడాలి.

– చైతన్య, చౌదరికాలనీ

కమిషనర్: ఈ విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి ఆమె ద్వారా స్పీకర్, కలెక్టర్‌కు విన్నవిస్తాం. నిధులు మంజూరైతే పనులను ప్రారంభిస్తాం.

ప్రశ్న: రైతుబజార్ వద్ద ప్రధాన రోడ్డుపై శని, ఆదివారాల్లో కూరగాయలు విక్రయిస్తున్నారు. ఈ మార్గంలో బస్సులు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డుపై కూరగాయలు విక్రయించకుండా చూడాలి.

– సురేష్, గాంధీ కాలనీ

కమిషనర్: కూరగాయల విక్రయించడానికి అనువైన స్థలాన్ని పరిశీలిస్తాం. త్వరలో సమస్యను పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం త్వరలో పూర్తయ్యేలా చూస్తాం.

ప్రశ్న: పట్టణంలోని అస్సాం బేకరి నుంచి బీటీఎస్ వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ప్రధాన రోడ్లపై ఉన్న దుకాణాల్లో చెత్త సేకరణ గతంలో మాదిరిగా సాయంత్రం వేళ సేకరించాలి. దీంతో ఉదయం ఎక్కడా చెత్త కనిపించదు.

– పోకల సతీష్‌కుమార్, వికారాబాద్

కమిషనర్: గతంలో మాదిరిగా రోజూ సాయంత్రం చెత్త సేకరిస్తాం. ఈ విషయాన్ని శానిటేషన్ సిబ్బందితో చర్చించి త్వరలో చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వికారాబాద్ బస్టాండ్ నుంచి గంగారం వరకు కుక్కల బెడద చాలా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, గంగారం

కమిషనర్: కుక్కల సమస్యను ఇదివరకే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. వీధి కుక్కల స్టెరిలైజేషన్ సెంటర్‌ను రీ ఓపెన్ చేస్తున్నాం. సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: పట్టణంలోని పాఠశాలల పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమల బెడద ఎక్కువయ్యింది. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి.

– నాగయ్య, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధి

కమిషనర్: వర్షాలు తగ్గినందున మున్సిపల్ సిబ్బందితో గడ్డి మందు పిచికారీ చేయిస్తాం. దోమలను నియంత్రించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయిస్తున్నాం.

ప్రశ్న: మున్సిపల్ పరిధిలోని పార్కులను బాగు చేయాలి. అలాగే మధు కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– యాదగిరి యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

కమిషనర్: పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. పార్కుల్లో గడ్డి మందు పిచికారీ చేసి పిచ్చి మొక్కలను తొలగిస్తాం. కుక్కల బెడద లేకుండా చూస్తాం.

ప్రశ్న: ధన్నారం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసి నాలుగేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే పనులు చేపట్టాలి.

– సాయిచరణ్‌రెడ్డి, ధన్నారం

కమిషనర్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం విషయం గురించి చైర్‌పర్సన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. నిధులు ఉంటే వెంటనే పనులను ప్రారంభిస్తాం. లేకుండా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని అన్ని పాఠశాలల వద్ద జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. చాలా పాఠశాలలు రోడ్డు పక్కనే ఉండటంతో పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– హరీష్‌రావు, విద్యార్థి నాయకుడు

కమిషనర్: ఈ విషయం గురించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి స్కూల్ జోన్‌ల వద్ద పిల్లల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. అప్పటి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూళ్ల యాజమాన్యం జాగ్రత్తగా ఉండాలి.

ప్రశ్న: కలెక్టరేట్ వద్ద గల కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి రోడ్డుపైకి మురుగు చేరుతోంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేయించాలి.

– నర్సింలు, వికారాబాద్

కమిషనర్: వెంటనే సిబ్బంది పంపి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని శుభ్రం చేయిస్తాం. మురుగు సాఫీగా ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 13వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నాం. వెంటనే వీధి దీపాలు వెలిగేలా చూడాలి.

– రాజు, 13వ వార్డు

కమిషనర్: పాడైన వీధి దీపాలను తొలగించి కొత్త వాటిని అమర్చుతాం.

పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కమిషన్ కోరారు. రోడ్లపై చెత్త వేయరాదని, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జాన్ కృపాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం చెత్త సేకరణ షురూ..

పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాల నుంచి సాయంత్రం వేళ చెత్త సేకరణ ప్రారంభమైంది. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పోకల సతీష్.. దుకాణాల నుంచి సాయంత్రం వేళ చెత్తను సేకరించాలని కోరారు. స్పందించిన కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఇతర సిబ్బందితో సమావేశమై నేటి సాయంత్రం నుంచే చెత్త సేకరణ ప్రక్రియ ప్రారంభం కావాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది వ్యాపార సముదాయాల నుంచి సాయంత్రం చెత్త సేకరించారు.



దుకాణాల నుంచి చెత్త సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అర్హులకు పథకాలు అందాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాపాలన, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, జీపీ భవనాల పురోగతి, ఉపాధి హామీ పథకం పనులు, పారిశుద్ధ్యం తదితర వాటిపై ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ, గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. పథకాల అమలులో సాంకేతిక సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆగస్టు 20లోపు అంగన్‌వాడీ భవన మరమ్మతులు, పెయింటింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లను ఏర్పాటు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న జీపీ భవన వివరాలను తెలియజేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల ఫొటోలను పంపాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతుల భూములను యుద్ధ ప్రాతిపదికన చదును చేయాలని తెలిపారు. జిల్లాలో రూ.37 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, సీపీఓ అశోక్ కుమార్, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ వెంకటేశ్వరమ్మ, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, డీఎల్పీఓలు సంధ్యారాణి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సాహూ శ్రీలత, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను సొంతం చేసుకుంటుందని మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సాహూ శ్రీలత, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోసపూరిత పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న ప్రజారంజక పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లి అత్యధిక స్థానాల్లో గెలిపించేందుకు కార్యకర్తలకు కృషి చేయాలన్నారు. బీజేపీలో నిబద్ధత గల కార్యకర్తలు ఉంటారని, ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం సొంత డబ్బులు వెచ్చిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి రావడమే మిగిలిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్ కుమార్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను విస్మరించారు

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న అడివయ్య

షాద్‌నగర్: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో పెద్దపీట వేయకపోవడం బాధాకరమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో తమకు సరైన నిధులు కేటాయించ లేదన్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించినా అవి పక్కదారి పట్టాయని ఆరోపించారు. దీన్ దయాల్ దివ్యాంగుల పునరావాస పథకాన్ని ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి ఎలాంటి నిధులు కేటాయించలేదని అన్నారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడ దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రస్తావించలేదని అన్నారు. అధికారం చేపట్టిన వెంటనే దివ్యాంగులకు రూ.ఆరు వేల పెన్షన్ అందిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



తల్లిపాలే శ్రీరామరక్ష

- పుట్టిన గంటకే ఇచ్చే ముర్రుపాలతో శిశువుకు బలం
- 7వరకు తల్లి పాల వారోత్సవాలు

మాతృత్వ స్పర్శకు ప్రతి మహిళ పరితపిస్తుంది. పుట్టిన బిడ్డ ప్రేమను ఆస్వాదించాలని ఆరాటపడుతుంది. ఆ సమయంలో తల్లిపాలు పసికందుకు సంజీవనిలా పని చేస్తుందని అనేకసార్లు వైద్య నిపుణులు నొక్కి చెప్పారు.

షాబాద్: ఇంటికి దీపం ఇల్లాలయితే, ఆ దీపం ప్రసరించే వెలుగురేఖలు సంతానం. తల్లీ పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే ఆ ఇల్లు కాంతులీనుతుంది. తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఆరోగ్య పథకాలను అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

ముర్రుపాలు అమృతం

నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు దోహదపడతాయి. సహజ సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి. తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయి. అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయి. తల్లిపాలు ముఖ్యంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే అపోహలు వీడి తప్పకుండా బిడ్డకు పాలు పట్టించాలని చిన్న పిల్లల వైద్యనిపుణులు బాలింతలకు సూచనలు చేస్తున్నారు. పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు అందించే ముర్రుపాలు సహజ రోగనిరోధక శక్తి కలిగేలా చేస్తాయి. అందుకే తల్లిపాలను అమృతంతో పోలుస్తారు. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

పుట్టిన అరగంటలోపు బిడ్డకు పట్టే ముర్రు పాలు ఎంతో విశిష్టత కలిగి ఉంటాయి. లేత పసుపు పచ్చ రంగుతో కూడిన పాలను బిడ్డకు ఇవ్వడంతో పసికందు మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు జ్ఞాపక శక్తి పెరిగేందుకు దోహద పడుతుంది. గుండె, చర్మ సంబంధ వ్యాధులు, ఉబ్బసం, ఆస్తమా, బీపీ, షుగర్ రాకుండా చేస్తాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తి పెంపుదలకు దోహదపడతాయి. ఆరు నెలల పాటు రోజు బిడ్డకు 12 సార్లు తాగించాలి. ఈ పాలు తాగిన పిల్లల్లో స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ.

అపోహలు వీడాలి

సమాజంలో తల్లిపాలపై ఉన్న అపోహలు వీడాలి. పాశ్చాత్య దేశాల్లో బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంతో పరోక్షంగా తల్లి శారీరక సౌందర్యం దెబ్బతింటుందని, మహిళల అందం తగుతుందనే అపోహలున్నాయి. సహజ సిద్ధంగా ఉత్పత్తి అయ్యే తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తుంది. డబ్బా పాలతో బిడ్డ ఆరోగ్యంగా ఎదిగినా మానసికంగా మెరుగైన ఎదుగుదల ఉండదని వైద్యులు చెబుతున్నారు.

పాలిచ్చే సమయంలో..

బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లి కొన్నింటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదు. ఇలా ఇవ్వడం చాలా ప్రమాదకరం. పాలిచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతల పానియాలు తీసుకోకపోవడం మంచిది. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

పాలు రావడం లేదని..

చాలా మంది తల్లులు పిల్లలకు సరిపడా పాలు రావడం లేదని బాధపడుతుంటారు. కానీ పుట్టిన బిడ్డకు సరిపడా పాలు తల్లి ఇవ్వగలుగుతుంది. తల్లి పాలు బిడ్డకు పూర్తి స్థాయిలో ఇవ్వగలిగితే మళ్లీ ఉత్పత్తి అవుతాయి. చాలా మంది తల్లులు పిల్లలకు సగం పాలు మాత్రమే ఇస్తున్నారు.

అధిక పోషకాలు



తల్లిదండ్రులు డబ్బా పాలు కొని తాగించిన బిడ్డకు అమ్మపాలలో ఉన్న పౌష్టికాహారం అందించలేరు. పిల్లలను దృష్టిలో ఉంచుకుని డబ్బా పాలను తయారు చేస్తారు. కానీ తల్లి పాలలోనే పోషకాలుంటాయి. ఆకలితో బిడ్డ ఏడిస్తే డబ్బా పాలు ఇవ్వడంతో పిల్లలు శక్తిని కోల్పోతారు. కచ్చితంగా బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందివ్వాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

క్లుప్తంగా

సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలి

ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి



మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

పూడూరు: ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు సైబర్ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నాయన్నారు. సైబర్ నేరస్తులు రోజుకో కొత్త పంథాను ఎంచుకుని నేరాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నారని అన్నారు. వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. బాల్యవివాహాలు చేయడం నేరమని బలవంతంగా చేస్తే డయల్ 100కు నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది జమీల్, అనిల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తేలని ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీ

శంషాబాద్: ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్ల పంచాయితీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలు ఓలా, ఉబర్ సంస్థలు ప్రోత్సహిస్తుండడంతో తమ ఉపాధి కోల్పోతున్నామని రెండోరోజు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ట్యాక్సీ లు పూర్తి స్థాయిలో నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉన్నా రవాణశాఖ అధికారు లు, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఆర్‌టీఏ, సైబరాబాద్ పోలీసులు, జీఎంఆర్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గిగ్‌ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సలావుద్దీన్ డిమాండ్ చేశారు.

ఫుడ్ కోర్టులో మద్యం పట్టివేత

శంకర్‌పల్లి: ఫుడ్ కోర్టులో మద్యం అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల గ్రామంలోని కేకే ఫుడ్ కోర్టులో మోకిల తండాకి చెందిన రాజు(35), ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ కుమార్(42)లు మద్యం అమ్ముతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు చేయగా సుమారు రూ.30 వేల విలువ చేసే 56 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారా తయారీ సామగ్రి విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్

ఆమనగల్లు: నాటుసారా తయారీకి ఉపయోగించే వస్తువులను వ్యాపారస్తులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ హెచ్చరించారు. సారా రహిత రాష్ట్రంగా నిలపడానికి వ్యాపారస్తులు సహకరించాలని ఆయన కోరారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం ఆమనగల్లు పట్టణ కిరాణాషాపుల యజమానులు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ బద్యానాథ్‌చౌహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాటుసారా నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గిరిజన తండాలలో నాటుసారా తయారీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం వ్యాపారస్తులు సహకరించాలని కోరారు. నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక, ఇప్పపువ్వు తదితర వస్తువులను విక్రయించరాదని సూచించారు. నాటుసారా తయారీ వస్తువులను విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి రామ్మోహన్, సభ్యులు లక్ష్మయ్య, సురేశ్, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు ప్రయాణం.. ప్రమాదకరం

ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి గుండా ప్రయాణం చేయలంటేనే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇదీ కుల్కచర్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న పరిస్థితి.

- వర్షాకాలంలో ప్రయాణికులకు తప్పని పరేషాన్
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కుల్కచర్ల: పాలకుల నిర్లక్ష్యపు తీరుతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా రహదారులున్నాయని చెప్పుకోవడం తప్పిస్తే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా లేదు. వ్యవస్థ అభ్యున్నతిలో కీలకమైన వాటిలో రహదారులు ప్రధానమైనవి. రహదారులు ఏర్పాటు చేస్తున్న క్రమంలో మధ్యమధ్యలో ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిలను వదిలేస్తుండటంతో పరిసర ప్రాంతవాసులకు తీవ్ర ఇబ్బంది కరంగా మారుతోంది. కల్వర్టుల నిర్మాణంలో అధికారగణం తీరు మారకపోవడంతో సామాన్యులకు గోస తప్పడం లేదు.

మూడు కల్వర్టులు ఇబ్బందికరంగా..

కుల్కచర్ల మండల కేంద్రం నుంచి దోమ మండలం దాదాపూర్ గ్రామం వరకు 9 కిలోమీటర్ల దూరం వరకు మూడు కల్వర్టులు ఇబ్బందికరంగా ఉన్నాయి. వాటిని ఏర్పాటు చేసి ఎన్నో ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి మరమ్మతులకు నోచుకోలేదు. రాంనగర్ గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గరలో వాగు వెళ్లే ప్రాంతంలో ఒక కల్వర్టు ఉంది. అది ప్రస్తుతం రాళ్లరప్పలతో గుంతలు పడి ఇబ్బందికరంగా మారింది. రాంనగర్ గ్రామం దాటిన వెంటనే మరొక కల్వర్టులో సైతం ఏర్పడిన పెద్ద గుంతతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమ మండలం దాదాపూర్‌కు వెళ్లే క్రమంలో మరొక కల్వర్టు పూర్తిగా తారు కొట్టుకుపోవడంతో బండరాళ్లపై వాహనదారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

వర్షాకాలం వచ్చిందంటే చాలు..

మండల కేంద్రం నుంచి దాదాపూర్‌కు వెళ్తున్న క్రమంలో ఉన్న మూడు కల్వర్టుల దగ్గర వర్షాకాలం వస్తే రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వాగు ధాటికి వాహనాలు నిలిచిపోయిన పరిస్థితులు కూడా ఉన్నాయి. రాత్రి సమయాల్లో అయితే కొత్త వ్యక్తులు కిందపడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. గత వర్షాకాలంలో ప్రయాణికుల ఇబ్బందులు తెలిసినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కంకరరాళ్లు తేలిన కల్వర్టులు దర్శనమిస్తున్నాయి.



రాంనగర్ గ్రామంలో నీటితో నిండిన రోడ్డు



దాదాపూర్ పరిధిలో ఉన్న కల్వర్టుపై నిలిచిన నీరు

వరదలొస్తే వణుకు పుడుతోంది



కల్వర్టులు నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాలు పడిన సందర్భాల్లో కల్వర్టులపై వాహనాలతో వెళ్లాలంటే వణుకు పుడుతోంది. వరదలు వస్తే ఇతర మార్గాల ద్వారా గ్రామానికి చేరుకోవాల్సి వస్తోంది. కొత్త వ్యక్తులు గ్రామానికి వచ్చేటప్పుడు కింద పడిన ఉందతాలున్నాయి.

– సంతోష్, రాంనగర్, కుల్కచర్ల

ప్రతిపాదనలు పంపించాం

మండలం నుంచి దాదాపూర్ గ్రామం వరకు మూడు ప్రదేశాల్లో ఉన్న కల్వర్టుల స్థానంలో రెండు చోట్ల కొత్తగా బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం ఉంది. రెండు బ్రిడ్జిలను రూ.70–80 లక్షలతో నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపించాం. త్వరితగతిన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, కుల్కచర్ల

గుర్తు తెలియని వాహనం.. ఢీకొని వ్యక్తి మృతి

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని బాలాజీనగర్ భవాని వైన్స్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని 30 సంవత్సరాల లోపు ఉన్న మృతదేహం గురించి అర్ధరాత్రి పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలుసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

సంతకు వచ్చి.. తిరిగిరాని లోకాలకు

కూర్చున్న చోటే కుప్పకూలి వృద్ధుడి మృతి

కుల్కచర్ల: వారాంతపు సంతకు వచ్చిన వ్యక్తి తిరిగిరాని లోకాలకు చేరిన ఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన బుగ్యా నాయక్(65) చౌడాపూర్‌లో జరిగే వారాంతపు సంతకు కూరగాయలు కొనేందుకు వచ్చారు. కాగా చౌడాపూర్‌లో కొనసాగే మార్కెట్‌కు వచ్చిన ఆయన చౌరస్తాలో కుర్చుని ఉండగా అకస్మాత్తుగా కాళ్లుచేతులు కొట్టుకుని ఉన్నచోటే కుప్పకూలిపోయి మృతిచెందారు. ముందున్న కూరగాయలు అమ్మే వ్యక్తులు చూసేసరికే మృతి చెందడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలుపగా వారు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆయన కూమారులు ఇద్దరు మహారాష్ట్రకు వలస వెళ్లగా బుగ్యానాయక్ ఒక్కరే గ్రామంలో ఉంటున్నారు.

సందట్లో సడేమియా!

- బదిలీపై వెళ్లిన ఫారెస్ట్ అధికారులు
- అటవీ భూములను అన్యాక్రాంతం చేస్తున్న అక్రమార్కులు
- ధారూరు ఫారెస్టు రేంజ్‌లో 12 ఎకరాలు కబ్జా



అటవీ భూమిని ఆక్రమించి సాగు చేసిన పంటలు

ధారూరు: సందట్లో సడే మియా అనేలా వ్యవహరిస్తున్నారు కొంతమంది భూ కబ్జాకోరులు. అటవీ అధికారులు బదిలీపై వెళ్లడం వీరికి వరంగా మారింది. ఏకంగా అధికారులు నాటిన మొక్కలను కబ్జా చేసి వ్యవసాయ పొలంగా మారుస్తున్నారు. మండలంలోని మదనంతాపూర్, సంగాయపల్లి తండాల్లో 12 ఎకరాల అటవీభూమిని ఆక్రమించుకున్న సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ధారూరు ఫారెస్టు బీట్‌లో కాగ్నానది, పాత రైల్వే లైన్ భీంల వద్ద ఉన్న 25 ఎకరాల భూమిలో ఫారెస్టు అధికారులు మొక్కలు నాటి ప్లాంటేషన్ చేశారు. ఫారెస్టు రేంజ్ పరిధిలోని ధారూరును పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ జగన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ నరేశ్ బదిలీపై ఇటీవల వెళ్లిపోవడంతో అక్రమార్కులకు అవకాశం దొరికింది. ఇదే అదునుగా భావించి ఫారెస్టు రేంజ్ పరిధిలోని మదనంతాపూర్, సంగాయపల్లి తండాల్లో అక్రమార్కులు దాదాపు 12 ఎకరాల్లో మొక్కలను తొలగించి అందులో కంది, పత్తి పంటలను సాగు చేశారు. కబ్జాకారుల్లో నలుగురు మదనంతాపూర్ తండావాసులు ఉండగా, ఇద్దరు సంగాయపల్లితండా వారున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం బుధవారం బయటికు పొక్కడంతో అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎఫ్ఆర్ఓ, డీఎఫ్ఆర్ఓ, బీట్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం.

మిత్రుడి పుట్టినరోజుకు వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ఘటనాస్థలిలో పడివున్న నవీన్‌కుమార్ మృతదేహం

పెద్దేముల్: స్నేహితుడి పుట్టినరోజు వేడుకను జరపడానికి వెళ్తున్న మిత్రబృందానికి రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఎదురైంది. లారీని వెనుక వైపునుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంఘటన బుధవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల మండల కమలాపురం గ్రామానికి చెందిన బైండ్ల రాములుకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు నవీన్‌కుమార్, నరేందర్, ఓ కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం వీరు హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లారు. బుధవారం ఉదయం నవీన్ కుమార్(17) తన స్నేహితుడైన అఖిల్ పుట్టిన రోజు కోసమని కమలాపురానికి వచ్చాడు. ఆటో డ్రైవరైన అఖిల్, మిత్రులు శివకుమార్, పూజిత, సరిత, మరో ఇద్దరి కలిసి పెద్దేముల్ మండల కోటపల్లి ప్రాజెక్టుకు వెళుతున్నారు. మార్గమధ్యలో కందనెల్లి తండా వై జంక్షన్ వద్ద రాగానే ఆటో డ్రైవర్ అఖిల్ ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టాడు. దీంతో నవీన్‌కుమార్ కింద పడడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తన కుమారుడి మృతికి కారణమైన అఖిల్‌పై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రగ్స్ విషం కంటే ప్రమాదకరం

అదనపు డీజీపీ సందీప్ శాండిల్య

శంకర్‌పల్లి: డ్రగ్స్ విషం కంటే ప్రమాదకరమైనవని, అవి వాడితే జీవితాలే నాశనం అవుతాయని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్, అదనపు డీజీపీ సందీప్ శాండిల్య హెచ్చరించారు. బుధవారం శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామ సమీపంలోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ అనేది ఒక మహమ్మారని, ఒకసారి అలవాటు పడితే వదలడం కష్టమన్నారు. యువత, విద్యార్థులు దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, దాని వల్ల వచ్చే అనార్థాల గురించి వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, కొనుగోలు చేసి వాడినా అత్యంత కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ వాడడం వల్ల యువత తమ స్టడీ, కెరీర్, లైఫ్, ఫ్యామిలీ రిలేషన్స్ చెడి పోతాయని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ ధర్మారెడ్డి, సీఐ గోపి, మోకిల సీఐ వీరబాబు, ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ వాడమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు డీజీపీ సందీప్ శాండిల్య

గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ పర్యటన



పాఠశాలను తనిఖీ చేస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి



బుద్ధారం పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

- స్వయంగా కల్యాణలక్ష్మి పంచనామా రాసిన అధికారి
- అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

పెద్దేముల్: ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి బుధవారం పెద్దేముల్ మండలంలో పర్యటించారు. సుమారు మూడు గంటలకు పైగా మండలంలో ధరణి, రిజిస్ట్రేషన్, ప్రక్రియను పరిశీలించి బుద్ధారం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో కల్యాణలక్ష్మి పంచనామా రిపోర్టును ఆమే స్వయంగా నమోదు చేశారు. ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మండలంలో ఏయే పంటలు రైతులు సాగు చేస్తారు. వ్యవసాయ సాగు భూమి ఎంత, అధికంగా ఏ పంటలు వేస్తారని తహసీల్దార్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. మ్యూటేషన్, సక్సేషన్, నాలా, పార్టీషన్ ప్రక్రియ వివరాలపై ఆరా తీశారు. బుద్ధారంలో విధుల్లో పర్యటించి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో రెండేళ్ల నుంచి వంట గది లేదని, చిన్న పాటి వర్షం పడినా వరద నీరు పాఠశాలలోకి వస్తుందని ఉపాధ్యాయురాలు సరోజ ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేక పోవడంతో ఆయాను అడిగారు. ఆమె వెంట తహసీల్దార్ కిషన్, సీనియర్ అసిస్టెంట్ వేణు, రెవెన్యూ సిబ్బంది మహేశ్, బసంతురెడ్డి, రమేశ్, శ్రీను, పంచాయతి కార్యదర్శి శ్రావణ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, లాలప్ప తదితరులు ఉన్నారు.

బండల ఇళ్లను చూసి షాక్

మండలంలోని బుద్ధారం గ్రామంలో బండల ఇళ్లను చూసి ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఆశ్చర్యపోయారు. బండల ఇళ్లు ఎలా నిర్మించారని వివరాలు అడిగారు. కింద కట్టెలతో పేర్చిన బండలు పెట్టి నిర్మించామని గ్రామస్తులు చెప్పడంతో షాక్ అయ్యారు. ఈ ప్రాంతంలో చాలా ఇళ్లు బండలతో కప్పబడి ఉంటాయని స్థానికులు చెప్పుకొచ్చారు.

వివాహిత ఆత్మహత్య..ఉద్రిక్తత

భర్తే కారకుడంటూ బంధువుల ఆందోళన

లింగోజిగూడ: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని వివాహిత బంధువులు పోలీస్టేషన్ ముందు ఆందోళన చేపట్టడంతో పాటు భర్తపై దాడి చేయడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం కురుమిద్దెకు చెందిన రమావత్ సుజాత(21)కు గతేడాది నల్లగొండ జిల్లా చితంపల్లి మండలం గాశిరాం తాండకు చెందిన రమావత్ శివతో వివాహం జరిగింది. వీరు హయత్‌నగర్ బంజారా కాలనీలో నివాసం ఉంటున్నారు. శివ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఆరునెలల పాప ఉంది. గత కొన్ని రోజులుగా వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుజాత మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన

కాగా సుజాత ఆత్మహత్య చేసుకోలేదని, శివనే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకకరించారని ఆరోపిస్తూ బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముందు సుజాత బంధువులు ఆందోళన చేపట్టారు. నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. సుజాత వివాహం సమయంలో ఇచ్చిన కట్నం, బంగారం తిరిగి ఇవ్వాలని శివ బంధువులతో గొడవకు దిగారు. దీంతో పోలీస్టేషన్ ఆవరణలో డబ్బును తిరిగి ఇస్తామని శివ కుటుంబ సభ్యులు ఒప్పందానికి వచ్చారు. ఈ సమయంలో స్టేషన్‌కు వచ్చిన శివపై సుజాత బంధువులు దాడి చేశారు. గమనించిన పోలీసులు వారిని ఆపడానికి ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఇద్దరు మహిళా పోలీసులకు స్వల్పంగా గాయాలయ్యాయి. సుజాత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని హ యత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు..

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం



శివకుమార్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: తాగుడు మానేయాలని భార్య మందలించిందనే కారణంతో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. బుధవారం ఉదయం పట్టాలపై ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు స్టేషన్ మాస్టర్, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు.. మృతుడు వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నీరటి శివకుమార్(25)గా గుర్తించారు. ఇతను మద్యానికి బానిసవ్వడంతో భార్య స్వప్న నిత్యం వారించేది. ఈ క్రమంలో ఇరువురికి గొడవలు జరిగేవి. ఈక్రమంలో మనస్తాపానికి గురైన శివకుమార్ షాబాద్‌లో ఉన్న తన సోదరి వద్దకు మంగళవారం వెళ్లాడు. బుధవారం షాద్‌నగర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.



దోమ: బొంపల్లిలో అమ్మవారికి బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

వైభవోపేతం.. బోనాల సంబురం



దుద్యాల్: పోతురాజుల వేషధారణలో స్థానికులు

దోమ: గ్రామాల్లో పోచమ్మ బోనాలు వైభవోపేతంగా జరిగాయి. బుధవారం మండలంలోని బొంపల్లితో పాటు లింగన్‌పల్లి గ్రామంలో అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేశ్, గ్రామస్తులు రాములు, రమేశ్, శేఖర్, యాదయ్య, అంతిరెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతల మైసమ్మకు..

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో చింతల మైసమ్మ బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.